
# 1

# మనం నయమేనా!

అబ్బూరి ఛాయాదేవి



మా ఇంటి చుట్టుపక్కల తిరిగే 'పులిగాడు' (గండుపిల్లి) మా 'మల్లిక' (తెల్లపిల్లి) వెంట తిరగడం, మొదట్లో పులిగాడికి భయపడి మల్లిక దూరంగా పారిపోవడం, పులిగాడు పట్టువదలని విక్రమార్కుడిలా మల్లిక వెంటపడటం, చివరికి మల్లికని మచ్చిక చేసుకున్నాక, పులిగాడితో మల్లిక స్నేహం మెలగడం, తరవాత కొన్నాళ్ళకి మల్లిక కడుపుతో ఉండటం, అప్పటి నుంచీ మల్లిక పులిగాడిని దూరంగా ఉంచడం, పులిగాడు మరోచోటికి వేటకి వెళ్ళడం, మల్లిక రెండు నెలల తరవాత ఏ మూలో సురక్షితమైన చోట ఈనడం, పాలకోసం ఒక్కర్తీ రావడం–అన్నీ కుతూహలంగా గమనిస్తూ ఉండేది మా పక్క వాటాలో ఉన్న ఎనిమిదేళ్ళ భువన.

"పిల్లల్ని తీసుకురాలేదా?" అని అడిగింది మల్లిక ఒక్కతీ రావడం చూసి.

"ఇంకా చిన్నవి కదా, రాలేవు" అన్నాను.

"అయితే పాలు ఎలా తీసికెళ్ళి ఇస్తుంది?" అని అడిగింది మరీ అమాయకంగా.

"తల్లి పిల్లలకి పాలిచ్చినట్లుగానే" అన్నాను. అప్పుడు అర్థం చేసుకుంది.

కొన్నాళ్ల తరవాత, వేరే చోట నుంచి ఒక్కొక్క పిల్లికూననీ మెడ దగ్గర నోటితో ఒడుపుగా పట్టుకుని మా ఇంటికి తీసుకొచ్చి, తోటలో గోడ పక్కన ఉన్న నీళ్ళ డ్రమ్ము వెనకాల పెట్టింది ఎప్పుడైనా పులిగాడు అటువైపు వస్తే, ఆ గండు పిల్లిని చూసి బెదిరించడం, దాన్ని దగ్గరికి రానివ్వకుండా అరిచి, పిల్లల్ని భద్రంగా చూసుకోవడం ఆసక్తిగా గమనించేది భువన.

ఆ నాలుగు పిల్లి పిల్లలకీ ఏం పేర్లు పెడదామా అని ఆత్రుతగా ఎదురు చూస్తూండేది. అవి ఇంకా బాగా ఎదగలేదు. ఎప్పుడూ డ్రమ్ము వెనకాల దాక్కుని ఉంటున్నాయి. ఒక దాన్ని ఆనుకుని ఒకటి, ఒక దానిమీద ఒకటీ కుప్పగా పడుకునేవి. తల్లి దూరం నుంచి వచ్చి మ్యావ్ మని సన్నగా అనగానే వెంటనే కదిలి తల్లిచుట్టూ చేరేవి పాలకోసం. ఇంకా తల్లి పాలే తాగుతున్నాయి. అప్పుడప్పుడు తల్లితోపాటు పెద్ద ప్లేటులో ఉన్న పాలకోసం ఎగబడేవి. కానీ ఇంకా ప్లేటులో పాలు తాగడం చాతకాక, పాలలో కాళ్ళు పెట్టి నడిచేవి. ఆ నాలుగు పిల్లల్లో మూడు గండు పిల్లి పోలికతో మచ్చలతో ఉండేవి. ఒక్కటి మాత్రమే తల్లిలా తెల్లగా ఉండి, పొట్టా, తోకా మాత్రం బ్రౌన్ రంగులో ఉండేవి.

క్రమంగా ఎదుగుతున్న కొద్దీ, వాటికి ఆకలి ఎక్కువై, తల్లిపాలు చాలక, పాలూ పెరుగూ అన్నం కలిపి ప్లేటులో పెడితే తినడం నేర్చుకున్నాయి. అన్నీ సమానంగా తినేవి కావు. ఒకటి రెండు పిల్లలు అప్పుడప్పుడొచ్చి రెండు మెతుకులు తిని వెడుతూంటే, మరో రెండు ఆబగా వచ్చి దబదబా తినేసేవి. ప్లేటు ఖాళీ అయి అన్నంకోసం తడుముకుంటూంటే చూసి మళ్ళీ పెట్టేదాన్ని. అప్పుడు తల్లి వచ్చి గబగబా తినేసేది. కానీ ఆ తల్లే ఎప్పుడైనా ఒక లేత బెండకాయ లాంటి ఎలక పిల్లని నోట కరచి తీసుకొచ్చి, మూలుగుతున్న గొంతుతో పిలిచేది రమ్మని. డ్రమ్ము వెనక దాక్కున్న పిల్లలు చకచకా బయటికి రాగానే తన నోట కరుచుకున్న ఎలక పిల్లని కింద పడేసేది. నాలుగు పిల్లల్లోనూ ఒకటి దూకుడుగా వెళ్ళి ఆ ఎలుక పిల్లని నోట కరచుకుని కొంచెం దూరంగా చెట్టు వెనక్కి తీసుకుపోయేది. తక్కినవి వెర్రి మొహం వేసుకొని చూస్తూండేవి. కుంతి లాగ పిల్లలతో "అందరూ సమానంగా పంచుకోండి" అని చెప్పడమో, తను పంచి ఇవ్వడమో చేసేది కాదు. ఎక్కణ్ణించో పట్టుకొచ్చి తను తినకుండా పిల్లల ముందు పడేసేది.

ఈ వ్యవహారమంతా ఆశ్చర్యంగా గమనిస్తూ ఉన్నది భువన.

ఒకసారి, "పాపం, మిగిలిన వాటికి తినడానికి ఇవ్వలేదు, అదేంటి ఆంటీ?" అని అడిగితే, "అదంతే. పిల్లి జంతువు కదా పిల్లలందరికీ సమానంగా పెట్టాలని మనిషి లాగ ఆలోచించదు" అని సమాధానం చెప్పాను. నా సమాధానంతో సంతృప్తి పడలేదు భువన.

"పాలూ పెరుగూ అన్నం అయితే నేను పెట్టగలను, ఎలక పిల్లని ఎక్కడ పట్టుకొచ్చి పెట్టగలను?" అన్నాను.

భువన నవ్వేసింది.

కొన్నాళ్ళ తరువాత మల్లిక మా ఇంటి వైపుకి రావడం మానేసింది. పిల్లిపిల్లలు బాగా ఎదిగాయి. ధైర్యంగా బయటకొచ్చి చెట్ల మధ్య తిరగడం, చెట్లమీదికి ఎక్కడం, పైనుంచి దూకడం, ఒక దాన్కొకటి తరుముతూ ఆడుకోవడం మొదలు పెట్టాయి.

"వాళ్ళమ్మ రావడం లేదేం? ఇవి పాపం బెంగ పెట్టుకోవా?" అని అడిగింది భువన ఒక రోజున.

"ఏమీ బెంగ పెట్టుకోవు. పిల్లి పిల్లలు ఎదిగాయి కదా. పాలు తాగే వయస్సు అయిపోయింది. ఇంక మీ సంగతి మీరు చూసుకోండి-ఇక్కడ ఆంటీ ఉంది కదా అని చెప్పి వెళ్ళిపోయింది తల్లి పిల్లి" అన్నాను.

"అదేమిటి, తప్పు కదా. ఎదిగితే మాత్రం తల్లి పిల్లల్ని అలా వదిలేస్తుందా ఎక్కడైనా?" అంది భువన.

"అవి మనుషులు కాదు కదా. జంతువులు అంతే" అన్నాను తేలిగ్గా.

"అయితే మనుషులే నయం కదా!" అంది భువన.

భువన అమాయకత్వానికి నవ్వుకున్నాను.

కొన్నాళ్ళ తరవాత వీధిలోకీ, పక్కిళ్ళకీ వెళ్ళి తిరగడం మొదలు పెట్టాక రెండు పిల్లి పిల్లలు పోయాయి.

ఒకటి కారు కిందపడి చచ్చిపోయింది. మరో పిల్లి పిల్లని కుక్క కరిచి చంపేసింది. ఆ సంగతి తెలిసి భువన గిలగిల్లాడిపోయింది. "పాపం, నాలుగూ సరదాగా ఆడుకునేవి. ఇప్పుడు రెండే మిగిలాయి" అంటూ జాలిపడింది.

"ఇవి మగ పిల్లులా, ఆడపిల్లులా?" అని అడిగింది ఓ రోజున.

"ఒకటి మగది, ఒకటి ఆడది" అన్నాను.

"ఎలా తెలిసింది మీకు?" అని అడిగింది.

తేడా చూపించాను దూరం నుంచి-అవి తోకలెత్తి పాలు తాగుతుంటే అప్పుడు వాటికి పేర్లు పెట్టింది-మగపిల్లికి 'నాటీ' అనీ, ఆడపిల్లికి 'స్వీటీ' అనీ.

ఆ మర్నాడే భువన పరుగెత్తుకుంటూ వచ్చి,

"ఆంటీ, ఆంటీ, చూడండి, ఆ పులిగాడు వచ్చాడు, స్వీటీ వెంట పడుతున్నాడు" అంది.

"ఇప్పుడు పిల్లి పిల్ల పెద్దదైపోయింది కదా, చంపదు, భయం లేదులే" అన్నాను.

"అది కాదు ఆంటీ. స్వీటీ పులిగాడి కూతురు కదా. ఇది వరకు మల్లిక వెంట పడినట్లు ఇప్పుడు స్వీటీ వెంట పడుతోంది" అంది- ఈ ఘోరాన్ని ఎలా అయినా ఆపండి అన్నట్లు నా వైపు కంగారుగా చూస్తూ.

"ఆ పులిగాడికి స్వీటీ తన కూతురని తెలియదు కదా. జంతువులకి ఆ జ్ఞానం ఉండదు" అన్నాను- అంతకన్న వివరంగా ఎందుకు చెప్పడం అని. "అలా అయితే మనుషులే నయం కదూ!" అంది భువన. భువన అమాయకత్వానికి మరొకసారి మనస్సులోనే నవ్వుకున్నాను. మంచీ చెడూ అన్నీ తెలిసి, మానవ సంస్కృతిని మరిచి తప్పు చేసే కొందరు మనుషుల సంగతీ, ఈ వికృత సమాజం గురించీ భువనకి తెలియడానికి ఇంకా సమయం పడుతుంది అనుకుని, ఆ విషయమై ఇక సంభాషణ పొడిగించ లేదు.

## సాహిత్య సమాచారం

**2010 మే 9వ తేదీన చిలకలూరిపేటలో గుంటూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నాం. రాష్ట్రం నలుమూలలనుంచీ అచ్చయిన కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. ఏప్రిల్ 25వ తేదీలోపు మీ పేరు, చిరునామలను పోస్టుకార్డుపై మాత్రమే రాసి ఈ క్రింది చిరునామాకు పంపవలసిందిగా కోరుతున్నాం.**

**బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, కార్యదర్శి,**

**గుంటూరుజిల్లా రచయితల సంఘం, మథర్‌థెరిస్సా భవన్,**

**డోర్ నెం. 6-9-28, 9/2 అరండల్ పేట, గుంటూరు-522002.**

**వివరాలకు : సోమేపల్లి వెంకటసుబ్బయ్య, సెల్ : 99593 24558ను సంప్రదించగలరు.**